# ఆడది - ఆడేది

మెయిలు వచ్చి విశాఖపట్నం స్టేషనులో ఆగింది. గోల మొదలు! ఎక్కే వాళ్ళని ఎక్కనీయకుండా, దిగేవాళ్ళని దిగనీయకుండా తోసుకోడాలు పరుగులు, కేకలు, మీల్స్ సరఫరా, ముష్టిపిల్లల ఆకలి కేకలు-హడావిడంతా గమనిస్తున్నాను థర్డ్ స్లీపర్‌లో కూర్చుని, కాదు, కాదు సెకండ్ స్లీపర్ అనాలి గాబోలు!

రైళ్ళలో పంగనామాల క్లాసులో ఒక నామం చెరిపేసి సెకండ్‌క్లాస్ అంటున్నారు గదా! కాంగ్రెస్ ప్రభుత్వం సోషలిజం ధర్మమా అని దేశంలో మధ్యతరగతిని తుడిచి ఒకే క్లాసు చెయ్యాలనే తాపత్రయంలో-క్రిందవాళ్ళని పైకి ఎలాగో లాగలేరు. కనక పై వాళ్ళని క్రిందికి చేర్చి మధ్యతరగతి అనేదాన్ని క్రమంగా రూపుమాపడానికి కట్టుకున్న కంకణానికి బలైపోయే నాలాంటి మధ్యతరగతి వాళ్ళకి ఫస్టుక్లాసు అనేది అందుకోలేనిది అయ్యాక మిగిలింది థర్డ్-కాదు! సెకండ్ క్లాసేగా! రైలు వాళ్ళ ధర్మమా అని స్లీపరు అంటూ వుంది గనక యీ మాత్రం అయినా ప్రయాణం చెయ్యగలుగుతున్నాం గదా అని సంతోషించాలి!

ఏదెలా ఉన్నా ఈ థర్డ్‌క్లాస్ ప్రయాణంలో నాకో మంచి లాభం కనిపిస్తుంది.

నేను కథలు రాయడం మొదలుపెట్టిన దగ్గిరనించి రైలుస్టేషనులు, బస్సుస్టాండులు కథలు వెతుక్కోడానికి మంచి చోట్లు అవుతున్నాయి. ఇదివరకు ఏది చూసినా యథాలాపంగా చూడడం మరిచిపోవడం.... యిప్పుడు-కనిపించిన ఏ చిన్న సంఘటన అయినా కథకి పనికివస్తుందా అన్న ధోరణిలో ఆలోచించడం అలవాటయింది. పదిమంది ఎక్కి దిగే థర్డ్‌క్లాసు కంపార్టుమెంటులో రకరకాల మనుషులని, మన స్తత్వాలని పరిశీలించే అవకాశం కలుగుతూంది. ఆ రోజూ అందుకే దీక్షగా ప్లాట్‌ఫారంని పరికిస్తున్నాను.

"ఇదిగో... యిదే మన సీటు నంబరు" అన్న మాట వినిపించి ప్లాట్‌ఫాం నించి కంపార్టుమెంటులోకి దృష్టి తిప్పాను, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి, ఒక ముసలాయన సీటు వెతుక్కుంటున్నారు. 'ఇదిగో క్రింది బెర్తు, పైది మనవి' అన్నాడా అబ్బాయి. నన్ను చూసి మర్యాదగా యింగ్లీషులో 'యీ మధ్య బెర్తుమీదా' అన్నాడు. అవునన్నట్టు తలాడించాను. 'ఏయ్ కూలీ ఆ సామాను యిటు తీసుకురా' అన్నాడబ్బాయి. ఓ పెద్ద ట్రంకు, ఓ సూట్‌కేస్, బెడ్డింగు, ఓ గోనెబస్తా, ఓ అట్టపెట్టె, ఓ బుట్ట, స్టీలు క్యారేజి, మరచెంబు-కూలీ సామాను అలా చేరేస్తున్నాడు. అప్పటికే సీటుక్రింద అంతా సామాను నిండివుంది. ఆ అబ్బాయి యిదినెట్టి, అది నెట్టి అక్కడ ఇక్కడికి లాగి మొత్తంమీద సామానంతా సర్దాడు. ముసలాయన 'జాడీలు జాగ్రత్తరా, ఆ పెట్టె వెనక్కి తిప్పిపెట్టు, బస్తా ఆ మూల నిలబెట్టు, నీళ్ళచెంబు యిలా తే' అంటూ అరుస్తున్నాడు. 'నువ్వూరుకో నాన్నా, నాకు తెలుసు' అన్నాడబ్బాయి విసుగ్గా. ఆ అమ్మాయి కుతూహలంగా నా వంక చూస్తూంది నిలబడి. 'ఓ సేప్ కూర్చో కూడదంటే అలా అడ్డంగా నిలబడకపోతే' ఆ అబ్బాయి విసుక్కున్నాడు. నేను కాస్త సర్దుకున్నాను అమ్మాయికి సీటిస్తూ, ఆ అమ్మాయి సందేహిస్తూనే కూర్చుంది. ఆ ముసలాయన ఎదుటి సీటుమీద కూర్చున్నాడు. ఆ అబ్బాయి సామానంతా సర్ది రుమాలుతీసి చెమట తుడుచుకుంటూ స్థిమితపడి కూర్చున్నాడు. నేను వాళ్ళని కుతూహలంగా గమనిస్తున్నాను.

ఆ ముసలాయన పల్లెటూరి భూకామందులా ఉన్నాడు. అబ్బాయి ఈనాటి చదువుకున్న పిల్లాడిలాగే వున్నాడు అమ్మాయి మాత్రం యిటు బస్తీ అటు పల్లె కానిదానిలాగా వుంది. నాజూకైన చీరకట్టినా, లోపల పరికిణీ పొట్టిగా వుంది. తలలో చామంతిపూలు, జూకాలు, కాళ్ళకి పట్టీలు, ఖరీదయిన జోడు, గాజుల మధ్య వాచి, మెడలో నల్లపూసలు, పలకసర్లు-వేషం కలగలుపుగా వుండి పల్లెలో పుట్టి, పెరిగి పట్నం వేషంని అనుకరిస్తూందని తెల్సిపోతుంది. కాళ్ళకి పసుపు, కొత్త చీర, బుట్టలోంచి వచ్చే మిఠాయి వాసనలు-యివన్నీ చూసి ఆ అమ్మాయి మొదటిసారి కాపురానికి వెడుతూంది గాబోలు అనుకున్నాను.

నా మాట నిజమే నన్నట్టు ఆ ముసలాయన 'జాగ్రత్తమ్మా, భయపడకు, మరేం ఫరవాలేదు అన్నయ్య సర్ది చెప్తాడు....నాలుగు రోజులు పోతే అతనే దారికివస్తాడు ఏమన్నా మాట్లాడక వూరుకో....' అంటూ కూతురికి అప్పగింతలు పెడ్తున్నాడు.

అంటే-యీాయన రాడన్నమాట! అన్నగారు తీసికెళ్ళి దిగబెడ్తాడన్న మాట! కాని ఆ అప్పగింత లేమిటి వింత అన్పించింది.

"ఒరే నాయనా కాస్త నెమ్మదిగా మాట్లాడి, మెల్లిగా నచ్చచెప్పు, పని సానుకూల పడేట్టు మాట్లాడు. అంతేగాని అతనితోపాటు నీవూ ఆవేశ పడి మొదటికే మోసం చేసుకురాకు. ఆడపిల్ల వాళ్ళం నాలుగన్నా పడాలి....' కొడుక్కి బోధన మొదలుపెట్టాడు. ఆ అబ్బాయి గంయ్‌మని లేచాడు. "యిలా నోరు మూసుకోబట్టే అతనలా ఆట లాడుతున్నాడు. ఏం, అతనేమన్నా పడుండడానికి మనం ఏంతప్పు చేశాం. ఆడపిల్లనిచ్చినంత మాత్రాన బానిసల్లా వంగి దండాలు పెట్టాలా?"

"అదుగో నా దగ్గిర మాట్లాడినట్టు అతని దగ్గిరా మాట్లాడకురా బాబు, మనమూ ఆవేశపడితే ఎలారా నాయనా, నిన్ను పంపిస్తున్నా నన్న మాటేగాని నాకు భయంగానే వుంది."

"అయితే నీవే వెళ్ళాల్సింది. నే నందుకే అసలు వెళ్ళనన్నాను" కొడుకు ధుమధుమ లాడాడు.

"దేశం కానిదేశం. ఆ భాష తెలియదు. నేనేం చేయగలనురా వెళ్ళి నీవయితే కాస్త నలుగురిని అడగగలవు మాట్లాడగలవని కదురా నిన్ను వెళ్ళమన్నాను."

"ఊఁ.... సర్లే... యింక నీ వెళ్ళు. మళ్ళీ ఊరు చేరేసరికి పొద్దుపోతుంది."

"వెడతాలే-రైలింకా చాలా సేపుంటుంది గామోలు రాత్రి పదిగంటలవుతుంది గాబోలు దిగేసరికి, చీకట్లో సామాను అదీ జాగ్రత్త.... ఆడపిల్ల కూడాను ... ఏదన్నా మంచి హోటలు చూసి తీసికెళ్ళు-త్రోవలో ఫోం చేసేయండి... ఉదయం ఆఫీసుకెళ్ళి వాకబు చెయ్యి-" ఆయన అలా చాదస్తంగా మాట్లాడుతూనే వున్నాడు.

"అబ్బబ్బ.... తెలుసు నాన్నా, ఎన్నిసార్లు చెబుతావు," గట్టిగా కసిరాడు కొడుకు. దాంతో ముసలాయన కాసేపు నోరు మూసుకున్నాడు. కంపార్టుమెంటంతా పరికించడం మొదలుపెట్టాడు. కాసేపు నా వంక చూసి "మీ రెందాక వెడతారమ్మా" అన్నాడాయన మర్యాదగా.

'భువనేశ్వర్' అన్నాను. ఆ మాట వినగానే ఆయన మొహం చింకిచాటంతయింది. సంబరంగా, "భువనేశ్వర్ వెడుతున్నారా మీరు కూడా" అన్నాడు. ఆ అబ్బాయి అమ్మాయి కూడా చురుగ్గా తలతిప్పి ఆశ్చర్యంగా చూశారు.

"ఒరే బాబూ, మీకు తోడు దొరికిందర్రా.... అమ్మా, మా వాళ్ళకి ఒరియా రాదు, మొదటిసారి వెడ్తున్నారు. ఏం తెలీదు. రైలు దిగగానే కాస్త వీళ్ళకి ఓ రిక్షానో బండో మాట్లాడి ఏదన్నా మంచి హోటలుకి తీసికెళ్ళమని చెప్పండమ్మా" అని ప్రాధేయపూర్వకంగా అన్నాడాయన.

"ఫరవా లేదండి. భువనేశ్వర్‌లో రిక్షావాళ్ళంతా తెలుగు వాళ్ళే. భాష రానంత మాత్రాన ఏం ఫరవాలేదు."

'అలాగా' అన్నాడాయన. మీ రెందుకెడుతున్నారమ్మా-' అని కుశల ప్రశ్నలు ప్రారంభించాడు. 'మా వారికి అక్కడ పని' అన్నాను.

"ఏం పని చేస్తారమ్మా" మరో ప్రశ్న. చెప్పాను-ఆయన కళ్ళు వెడల్పు చేసుకొని చూశాడు. మరో క్షణం నన్ను ఎగాదిగా చూసి "అమ్మా, మీకు గాని భువనేశ్వర్‌లో వీరభద్రం అనే అతన్ని తెలుసా. మా అల్లుడండి. ఎ, జి. ఆఫీసులో పని చేస్తున్నాడు" ఆరాటంగా అడిగాడు సంతలో ఎర్రపాగా వాడన్నట్లు భువనేశ్వర్‌లో వీరభద్రం అంటే ఏం తెలుస్తుంది.

"ఎ. జి. ఆఫీసునిండా రెండు మూడు వేల మంది తెలుగువాళ్ళున్నారు. అలా అంటే ఏం తెలుస్తుంది. అయినా నాకు పెద్దగా ఎవర్నీ తెలియదండి" అన్నాను. ఆయన నిరుత్సాహంగా చూశాడు. తండ్రి చాదస్తం మాటలకి నే నేం అనుకుంటానననో గాబోలు ఆ అబ్బాయి కాస్త సిగ్గు పడ్డాడు నన్ను చూసి.

"నీ అల్లుడేం గవర్నర్ ఉద్యోగం చేస్తున్నా డనుకున్నావా అందరికీ తెలియడానికి. అంతమందిలో వీరభద్రం అంటే ఆమె కేం తెలుస్తుంది? కొరకొర లాడాడు.

"క్షమించండి. ఏం అనుకోకండి. మా నాన్నదంతా చాదస్తం" అన్నాడు నా వంక తిరిగి.

"పెద్దవారు, ఫరవాలేదు. ఇందులో అనుకోడానికి ఏం వుంది!" అన్నాను నవ్వి.

"ఏమండీ. భువనేశ్వర్‌లో ఏమన్నా సౌత్ ఇండియన్ హోటల్సు వున్నాయండీ వుండడానికి" ఆరా తీసా డా అబ్బాయి.

"లేవండీ ఏదో చిన్న హోటలుంది, ఫలహారం భోజనం దొరుకుతుంది గాని వసతికి లేదండి...."

"పోనీ ఇంకేమన్నా మంచి హోటల్సు వున్నాయా?"

"ఏవో రెండు మూడు వున్నాయిగాని ఆ భోజనం మన తెలుగువాళ్ళం తినలేమండీ, మనవైపుకంటె యిక్కడ హోటల్సు అవి చాలా తక్కువ...."

ముసలాయన గాభరాగా "అయితే ఎలాగరా. ఎక్కడుంటారు కొత్తవూరు"

"అమ్మాయిని దింపడానికి వెళ్తున్నట్టున్నారు, అల్లుడుండగా హోటలులో దిగడం ఎందుకు...." కుతూహలం అట్టే కనపరచకుండా యథాలాపంగా అడిగినట్టు అడిగాను.

ఆయన మొహం చిన్నపోయింది. అబ్బాయి మొహం తిప్పుకున్నాడు. అమ్మాయి మొహం ఎర్రబడింది.

"అయ్యో రాత! అల్లుడు తిన్ననైన వాడైతే మాకీ తిప్పలు ఎందుకమ్మా. అల్లుడు అమ్మాయిని తీసికెళ్ళడు పెళ్ళయి రెండేళ్ళయింది. ఎన్నిసార్లు అడిగినా మాట్లాడడు. ఉత్తరాలకి జవాబివ్వడు. ఆడపిల్ల వాళ్ళం మాకు తప్పదు గదమ్మా! అమ్మాయిని తీసికెళ్ళి దింపాలని నిశ్చయించుకొన్నాం-" ఆయన అమాయకంగా సొద వెళ్ళబోసుకున్నాడు. ఆ అబ్బాయి తండ్రి అలా పరాయివాళ్ళ ముందు ఇంటి సంగతులు చెప్పడం ఇష్టంలేనట్టు వారిస్తూ తండ్రివంక చూశాడు. ఆయన అదేం పట్టించుకోకుండా-నేను భువనేశ్వర్ వెళ్ళేదాన్ని గనుక ఏమన్నా వాళ్ళకి సహాయపడ్తాననే గాబోలు తమ విషయం చెప్పడానికి సందేహించలేదు.

"అల్లు డింటికే తిన్నగా వెళ్ళకూడదా. మళ్ళీ హోట లెందుకు?"

"యింటి యడ్రసు తెలియదండి అతను జవాబివ్వడు. యిల్లు మారాడట. యింటి ఎడ్రసు తెలియదు. ఆఫీసుకెళ్ళి పట్టుకోవాలి."

"అలా అయితే మీ రొక పని చెయ్యండి. రైలు స్టేషన్‌లోనే మంచి రిటైరింగు రూమ్సు వున్నాయి. రోజుకి ఏడో ఎనిమిదో వుంటుంది, అక్కడ రాత్రి వుండండి" అని సలహా యిచ్చాను.

"అలా చెయ్యరా బాబూ, రాత్రి కొత్తవూరిలో హోటళ్ళు ఏం వెతుకుతావు" అన్నాడు ఆయన.

"అలాగేలే....నీ వింక దిగు. టైమైంది" అన్నా డబ్బాయి తండ్రిని క్రిందికి దింపుతూ. ముసలాయన దిగి కిటికీ దగ్గర నిల్చున్నాడు. "జాగ్రత్త

తల్లీ, ఏం భయంలేదు. ఆ దేముడే వున్నాడు. అధైర్యపడకు.... కూతురు తల నిమిరాడు ప్రేమగా, ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి అమ్మాయి కళ్ళలో నీరు నిండగా తలాడించింది. "తప్పమ్మా కంట తడిబెట్టకు" అన్నాడాయన పట్టుకున్న గొంతుతో. అమ్మాయి కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"ఒరే, జాగ్రత్తబాబూ, కోపంగా మాట్లాడకు. అమ్మా వీళ్లని కాస్త కనిపెట్టండి" అంటూంటే రైలు కదిలింది. ఆయన మాటలు గాలిలో కలిసి పోయాయి. అబ్బాయి వచ్చి సీటులో కూర్చుంటూ "అబ్బబ్బ నాన్నకి రోజు రోజుకీ మరీ చాదస్తం ఎక్కువవుతూందే" అన్నాడు చెల్లెలితో. ఆ అమ్మాయి కిటికీలోంచి బయటికి చూస్తుంది.

"పెద్దతనం వస్తే అందరూ అలాగే వుంటారులెండి" నవ్వుతూ అన్నాను. ఆ అమ్మాయి మొహంలో ఏదో దిగులు. భయం, భవిష్యత్ పట్ల బెదురు....ఏవేవో భావాలు కనిపించాయి. ఆ భయం మొదటిసారి అత్తింటి కెళ్ళే భయం కాదు; ఆదిగులు పుట్టిల్లు వదులుతున్నందుకు కాదు; పాపం అన్పించింది. అమ్మాయి అనాకారి కాదు లేనివాళ్ళూ కాదు. మరి ఆమె భర్త ఎందుకు తీసికెళ్ళడం లేదో తెలుసుకోవాలన్న కుతూహలం నిలవనీయకపోయినా ఇతర్ల స్వవిషయాలు ఏమని అడగను?

అతను ఒక్క క్షణం ఏదో అడగాలని తాపత్రయపడి ఆఖరికి సందేహిస్తూనే మీరు రచయిత్రులా కంపార్టుమెంటు బయట మీ పేరు చూసి, భువనేశ్వర్ అనగానే అనుకున్నాను నిజమేనా అని ప్రశ్నించాడు, నేను అవు ననగానే అతను చాలా సంతోషంగా నన్ను కలుసుకున్నందుకు ఆనందం వెలిబుచ్చి మీ రేం రాస్తున్నారని వాకబు చేస్తూ మాట్లాడాడు. ఆ అమ్మాయి మొహం ఇంత సేపటికి విప్పారింది. నన్ను ఆశ్చర్యంగా చూచి "మీరా" అంటూ ఆనందం వెలిబుచ్చింది. వారిద్దరి పొగడ్తలకి తబ్బిబ్బు అవుతూ అది పైకి కనిపించకుండా దాచుకోవాలని తాపత్రయపడి (పొగడ్తకి లొంగని వాళ్ళెవరు!) సంభాషణని మారుస్తూ "మీ బావగారు భువ

నేశ్వర్‌లో ఎన్నాళ్లబట్టి వుంటున్నారు, యీ ఒరియా దేశంలో సంబంధం మీ కెలా తటస్థపడింది?" అంటూ ప్రశ్నించాను.

"పెళ్లికి ముందునించే రెండేళ్ల పై నించే ఇక్కడ వున్నారు. ఇతను ఉద్యోగం ఇక్కడగాని అతని తల్లి దండ్రి మా పల్లెకి ప్రక్కపల్లే, మా మామయ్యకి బాగా తెల్సినవాళ్ళు-ఆయనే తెచ్చారు సంబంధం" అన్నా డతను.

"మరి పెళ్లయి రెండేళ్లయితే ఇన్నాళ్ల దాకా కాపురానికి ఎందుకు పంపలేదు?" ఎలాగైనా ఆ అమ్మాయి సంగతి తెల్సుకోవాలన్న కుతూహలం నన్ను నిలవనీయలేదు. అతను ఒక్క క్షణం చెప్పడమా. మానడమా అన్న సందిగ్ధంలో పడినట్లు మొహంపెట్టి, తరువాత ఎలాగో నాకు తెల్పిందనో నాపట్ల వున్న గౌరవం కొద్దో....

"మేం పంపక పోవడం ఏమిటి. అతనే తీసికెళ్ళలేదు?" అన్నాడు.

"అదేం?"

"అదేం అంటే ఏం చెప్పడం-వళ్ళు పొగరు, మగాడు ఏం చేసినా చెల్లుతుందనే అహంకారం. వాడి బతుక్కి ఇది చాలలేదట, పల్లెటూరిదట! అట్టే చదువుకోలేదట. మూడుసార్లు తప్పి బి. ఏ. పేసయ్యాడు, వాడూ కబుర్లు చెప్పడమే" అవేశంగా అన్నాడు.

"మరి ముందీ విషయాలు తెలియవా?" ఆ అమ్మాయి వంకచూస్తూ అన్నాను పాపం ఆ అమ్మాయి చిన్నపుచ్చుకున్న మొహంతో మా మాటలు వింటూంది.

"అదేనండి నా బాధ పెళ్ళిచూపులు చూసుకున్నాడు. అన్నీ తెలుసుండి చేసుకొని ఇప్పుడు పల్లెటూరిది, చదువురానిది అంటూ వంకలు పెట్టడం ఏమిటి అనే నా గొడవ-

"అలా అడగక పోయారా....తాళి కట్టాక, వద్దనడానికి, మానడానికి ఆయ నిష్టమేనా ఏమిటి?" ఒక ఆడపిల్లకి జరిగే అన్యాయాన్ని తలచుకుని నేనూ కాస్త ఆవేశంగానే మాట్లాడాను.

"అడిగాం వూరుకున్నామా ఏమిటి-అడిగితే నాకు తెలియదు, నాకీ పెళ్ళి ఇష్టం లేదు. కట్నంకోసం మా నాన్న బలవంత పెడితే చేసు

కున్నాను. మా నాన్నని అడగండి పెళ్ళి ఏం చేస్తారో ఆయనిష్టం, మీ యిష్టం అంటాడు" అంటూ ముందునించి అంతాచెప్పుకొచ్చాడు ఆ అబ్బాయి ఆవేదనగా, ఆవేశంగా.

అన్నట్టు అతని పేరు ప్రసాద్-ప్రసాద్ చెప్పిన వివరాలు యివి-వాళ్ళది విశాఖపట్నం దగ్గిర ఓ పల్లెటూరు భూములున్నాయి, తండ్రికి నలుగురు ఆడపిల్లలు, యిద్దరు మగపిల్లలు. ప్రసాద్ మగపిల్లల్లో పెద్దవాడు. విశాఖపట్నంలో యీ ఏడాదే యింజనీరింగు పూర్తిచేశాడు. ముగ్గురమ్మాయిలకి తండ్రి బాగానే మంచిచోటే యిచ్చి పెళ్ళిళ్ళు చేశాడు. అల్లుళ్ళకు పెద్ద చదువులు లేకపోయినా ఆస్తిపాస్తులు వున్నవాళ్ళు-ఆ ఇంట్లో ప్రసాద్ ఒకడే అంత పెద్ద చదువు చదివాడు. ఆఖరిపిల్ల వరలక్ష్మి, వరలక్ష్మి ఆ వూళ్ళోవున్న థర్డుఫారం చదివింది. ఆడపిల్లని పై వూరుపంపి చదివించడానికి తల్లి దండ్రులు యిష్టపడకపోవడంతో చదువాగిపోయింది. కాని మంచి తెలివి గల పిల్ల, చదివిన ప్రతి క్లాసులోనూ ఫస్టు వచ్చేది. పత్రికలు చదువుతుంది. కుట్లు అల్లికలు, వంట వార్పు అన్నీ వచ్చు. వరలక్ష్మికైనా కాస్త చదువుకున్న ఉద్యోగస్థుడిని చేయాలని ముచ్చట పడ్డాడు తండ్రి, ప్రక్క-వూరిలో వీరభద్రం తల్లి దండ్రులకి తమంత ఆస్తి లేకపోయినా స్వంత ఇల్లుంది. కొద్దో, గొప్పో భూమీ వుంది. అబ్బాయి బి. ఏ. చదివి మూడొందలు తెచ్చుకుంటున్నాడు. అందగాడు, చదువుకున్నవాడు వరలక్ష్మికి మొగుడయినందుకు అంతా వరలక్ష్మిని అదృష్టవంతురాలన్నారు. పెళ్ళిలో మంచి ముహూర్తం లేదని మరో మూడు నెలలకి కార్యం వాయిదా వేశారు.

మూడు నెలల తరువాత కార్యానికి ముహూర్తం పెట్టి వియ్యాల వారికి రాస్తే అల్లుడికి శలవులేదు. ఇప్పుడు కాదన్నారు. తరువాత మరో ముహూర్తానికి అల్లుడికి జ్వరం అన్నారు. మరోసారి అల్లుడి కేదో పని వుంది, యిప్పుడు కాదన్నారు. అలా నాలుగైదు సార్లు ఏవేవో సాకులు చెప్తూ రాలేదట. అప్పటికి ఏడాది అయింది పెళ్ళయి. తండ్రి గాభరాపడ్తూ వియ్యాల వారింటికి రెండుసార్లు పరిగెత్తాడు. ఏవేవో చెప్తూ అబ్బాయి

ఇప్పుడు కాదు కొన్నాళ్ళు పోనిమ్మంటున్నాడు. ఆగండన్నారు. కొన్నాళ్ళు పోయాక మళ్ళీ ఈ సారి కాస్త ఘాటుగా మాట్లాడేసరికి వియ్యంకుడు. కొడుకు తన ఉత్తరాలకి జవాబివ్వడం లేదని, కోడల్ని కాపురానికి తీసికెళ్ళమంటే మాట్లాడడని, తనేం చేస్తాడని మీరేవెళ్ళి మీ అల్లుడితో మాట్లాడండి అన్నాడట.

వీళ్ళు చేసేదిలేక పిల్ల మేనమామని అల్లుడి దగ్గరికి పంపి అసలు సంగతి కనుక్కోరమన్నారట. మేనమామ వెడితే అల్లుడు అతనెవరో తెలియనట్లు, ఎందుకొచ్చాడో, ఏం మాట్లాడుతున్నాడో అర్థమేలేనట్లు మాట్లాడాట-పిల్లని కాపురానికి తీసికెళ్ళవా అంటే ఏ పిల్ల అన్నాడట-అతని వ్యవహారం చూసి వళ్ళుమండి నిలేసి అడిగితే-ఆ పెళ్లి తన ఇష్టప్రకారం జరిగింది కాదు. తను ఆ భార్యతో కాపురం చెయ్యడు. తండ్రి బలవంతాన పుస్తె కట్టాను. ఆ పల్లెటూరిది చదువు రానిది తన కక్కరలేదని తెగేసి చెప్పాడట. పిల్లగతేమిటంటే వెళ్ళి మా నాన్న నడగండి అని మరింక నోరిప్పి మాట్లాడలేదట.

మామయ్య తిరిగివచ్చి జరిగింది చెప్పాక తల్లిదండ్రి లబోదిబో మన్నారు. తండ్రి వియ్యంకుడి దగ్గరికి పరిగెత్తాడు మళ్లీ 'మీ అల్లుడి నడగండి నేను కాదుగదా మీ పిల్లతో కాపురం చేసేది' అన్నాడట ఆయన. కొడుకు నడగమని తండ్రి. తండ్రి నడగమని కొడుకు ఇలా ఉత్తరాలు, రాయబారాలు మాటలు అన్నీ జరిగాక-ఆఖరికి ఓ రోజు వరలక్ష్మిని అత్తగారింట దిగవిడిచి మీ కోడలను మీ ఇంట దింపాం ఇంక మీ ఇష్టం అని చెప్పి వచ్చేశారట. తండ్రి కోడలు వచ్చినట్లు రాయకుండా కొడుకుని తల్లికి వంట్లో బాగులేదని పిలిపించారట. కొడుకు వచ్చి జరిగిన మోసం గ్రహించి ఇలా చేస్తే ఇంక ఇంటికే రాను అని అలిగి వెళ్ళిపోయాడట కొడుకు. దాంతో ఆ మామగారు మళ్ళీ కోడల్ని పుట్టింట దింపి మీ ఇష్టం, మీ అల్లుడిష్టం. మీ అమ్మాయిచేత దాసిపని చేయించుకోమని మీ ఉద్దేశం అయితే అలాగే వుంచుకుంటాం ఇంక మళ్ళీ నా దగ్గరికి రాకండి అనీ ఖచ్చితంగా చెప్పి వెళ్ళిపోయాడట.

వీళ్లేం చేస్తారు? వరలక్ష్మి ఏడుపు తల్లి కూతురు కాపురం ఇలా అయినందుకు ఏడుపు. తండ్రి దిగులు, ఊర్లో వాళ్ళ ప్రశ్నలు తలెత్తుకో లేని స్థితి అయింది. అసలు అల్లుడెందుకు ఇలా ప్రవర్తిస్తున్నా డని మరో సారి మామయ్యని పంపేసరికి చుట్టుప్రక్కల వాళ్ల ద్వారా రాబట్టిన సమాచారం వల్ల తేలిందేమిటంటే అల్లు డెవరినో తన ఆఫీసులో పనిచేస్తున్న టైపిస్టుని ప్రేమించాడని, కులాలు వేరవడంవల్ల అమ్మాయి తల్లిదండ్రులు ఇష్టపడలేదని ఈ లోగా తండ్రి బలవంతం, తల్లి చస్తానని బెదిరించడంవల్ల అతను వరలక్ష్మి మెడలో పుస్తె కట్టాడు. అక్కడ ప్రేమించిన అమ్మాయితో చాటుమాటు వ్యవహారం సాగిస్తున్నాడు.

ఆ విషయం విన్నాక ఇంకా ఆలస్యం చేస్తే కూతురు కాపురం మరి చక్కబడదని, అల్లుడింట్లో దింపి వచ్చేస్తే అతనే దారికి వస్తాడని వీళ్ళు వరలక్ష్మిని అక్కడ దింపేసి రమ్మని ప్రసాద్‌ని తోడిచ్చి పంపుతున్నారు.

“బాగుంది ఈ పని మీ రెప్పుడో చెయ్యవలసింది. ఇన్నాళ్ళు వూరుకోడం మీదే తప్పు-ఇష్టమున్నా లేకపోయినా పెళ్లాడాక వదనడానికి అతనికేం హక్కులేదు-ఆ మాట మీ రెందుకు నిలేసి అడగలేదు?” అంతా విని ఆవేశంగా అన్నాను నేను.

“అదేనండీ నే ననే మాటాన్నూ, ఎవడికోసం ఏలుకుంటాడు కోర్టుకెక్కుద్దాం అన్నాను. అమ్మ నాన్న పరువు ప్రతిష్ట కూతురు కాపురం చాదస్తంగా మాట్లాడుతారు.” విసుగ్గా అన్నాడు ప్రసాద్.

“ఇప్పుడు కూడా అతను దారికి రాకపోతే మీరేం చేస్తారు?” ప్రశ్నించాను.

ప్రసాద్ బుర్ర గోక్కున్నాడు. “అదే తెలియడం లేదండి-ముందు ఏం జరగనట్టు మంచిగా మాట్లాడాలి. మీ భార్యని తీసుకొచ్చి దింపాను నా పని అయిపోయింది అని చెప్పి రమ్మన్నారు ఇంట్లో....”

“అలా చేశాక అతను అమ్మాయితో కాపురం చెయ్యకపోతే.... నీచంగా చూసి బాధలు పెడితే-తిరిగి రైలెక్కించి పంపేస్తే ఏం చేస్తారు? మొండిగా అమ్మాయిని వుంచేస్తే ఆ అమ్మాయి ఆత్మాభిమానం చంపుకుని

ఎంతకని పడివుంటుంది. ఇష్టం లేదనే భర్తతో మనసు చంపుకుని అవమా నాన్ని సహిస్తూ ఎలా బ్రతుకుతుంది?"

"నే నేం చెయ్యనండీ, మా వాళ్ళు పల్లెటూరి వాళ్ళు. ఆడదానికి మొగుడూ కాపురం లేకపోడం అవమానం అనుకుంటారు తప్ప, దీన్నిలా తీసికెళ్ళి దిగవిడిచి రావడం దానికెంత అవమానం అన్నది వాళ్ళకి అర్థం గాదు. వాళ్ళ పరువు ముఖ్యంగాని దీని బ్రతుకెంత హీనంగా మారుతుంది అన్నది వాళ్ళకి పట్టదు. మొగుడు తీసికెళ్ళకపోతే పీడా పోయింది శుభ్రంగా దాన్ని చదివించండి, ఏ ఉద్యోగమో చేసుకొని హాయిగా బ్రతుకుతుంది అని నేను ఎంతో చెప్పాను, వినేదెవరు? వెధవ మాటలు మాట్లాడకు, పెద్ద కబుర్లు చెప్పకు, ఆడదానికెంత చదువున్నా మొగుడూ సంసారం అక్కర లేదా-అంటూ మాట్లాడే వాళ్ళకి నే నేం చెప్పనండీ.... అమ్మ ఏడుపు చూసి దీని మొహంచూసి వప్పుకున్నాను ...."

"మీరు ఆవేశపడి చేయగలిగిందేమీ వుండదు. సరే ఎలాగో వెడ్తున్నారు గనుక ముందు అతను దారికి వస్తాడేమో చూడండి-పాత సంగతులు ఏం జరగనట్టె చెల్లెల్ని దింపి వెళ్ళడానికి వచ్చానని సౌమ్యంగా చెప్పండి. అతను వినకపోతే, దారికి రాకపోతే "మా చెలెలికి పెళ్ళి కాలేదు అనుకుని మరో పెళ్ళి చేసుకుంటాం కట్నం డబ్బు వెంటనే కావాలని నిలేయండి అప్పటికీ అతను లొంగి రాకపోతే కోర్టులో కేసులేస్తాం అని బెదిరించండి ఇదంతా ఉత్త బెదిరింపు అని అతను అనుకోకుండా ఓ ప్లీడరుని వెంట బెట్టుకు వెళ్ళి మాట్లాడి నోటీసు ఇప్పించండి. అందరిముందు నిలబెట్టి అతని సంగతి బయట పెడ్తానని, ఆఫీసరుతో చెప్తానని బెదిరించండి. దీనికీ లొంగి రాకపోతే ఆఖర్న కోర్టు వుండనే వుంది. నాకు తెల్సిన తెలుగు ప్లీడరున్నారు, ఎడ్రసు ఇస్తాను. కల్సుకోండి...." సలహా చెప్పాను.

"కోర్టు అనగానే భయపడి అతను లొంగినా....తరువాత ఆ కోపం దీనిమీద చూపించ డంటారా?" అతను సందేహం వెళ్ళబుచ్చాడు.

మా సంభాషణ అంతా పాలిపోయిన మొహంతో వింటున్న వరలక్ష్మి ....'అన్నయ్యా వద్దు రా....నేనక్కడికి వెళ్లను .... ఇంటికి పోదాం ....

నేనుండలేనురా అక్కడ.... నాన్నతో చెప్పి నేను చదువుకుంటాను...' అంటూ కళ్లమ్మట నీరు తిప్పుకుని అధైర్యంగా అంది.

"భయపడకమ్మా....యిలాంటి వాళ్ళని యింత తేలిగ్గా వదలకూడదు ధైర్యంగా ఎదిరించాలి. అతను సవ్యంగా వున్నాడనిస్తే మంచిదే-లేదంటే కోర్టు వుండనేవుంది. కోర్టు సగం జీతం యిప్పిస్తుంది. చదువు కుందువు గాని....నీ బ్రతుకు నీవు బ్రతుకుదువుగాని ఒకవేళ అతనుకోర్టు అంటే భయపడి నిన్ను వుంచుకుని తరువాత సరిగా చూడకుండా బాధలు పెడితే తిన్నగా యింటికి వచ్చేయ్ ఆ అమ్మాయికి చాలాసేపు ధైర్యం చెప్పాను.

రాత్రి తొమ్మిదిన్నరకి భువనేశ్వర్‌లో దిగేవరకు ఆ ఎనిమిది గంటలు చాలా తొందరగా గడిచిపోయాయి, ఈ మాటలతో యింటికెళ్ళి భోజనం చేస్తానన్నా వినకుండా వాళ్ళు తెచ్చుకున్న పులిహోర, మినపట్టు బలవంతాన తినిపించారు.

వెళ్ళే లోపల మా యింటికి తప్పక రమ్మని ఆహ్వానించాను ప్రసాద్‌ని. ఏం జరిగింది వచ్చి చెపుతానని మాటిచ్చి ఎడ్రసు తీసు కున్నాడు ప్రసాద్.

రైలుదిగి వాళ్ళకి రిటైరింగు రూమ్సు చూపించి ఆయనతో కారెక్కాను ...'వాళ్ళెవరు ?' అన్నారాయన. జరిగిందంతా చెప్పాను. 'బాగానేవుంది మంచి కథకి ప్లాటు దొరికిందన్నమాట' అన్నారాయన. 'ఆ కథకి ముగింపు ఏమిటో యింకా తెలియదు' అన్నాను.

◆ ◆ ◆ ◆

వూరునించి వచ్చిన మూడోరోజు ఉదయం పది గంటలవేళ ప్రసాద్ మా యింటికి వచ్చాడు. ఆహ్వానించి అతను కూర్చోకముందే ఆరాటంగా "ఏమయింది ?" అన్నాను.

అతను కూర్చోకుండానే....హా....ఏమవుతుంది. మీ ఆడవాళ్ళు యింక బాగుపడరండి అణగదొక్కు తున్నారు-అడుగున పడేశారు. ఉద్ధరించాలి. సమాన హక్కులు అని ఉపన్యాసాలు, కథలు తప్ప

కార్యాచరణలోకి వచ్చేసరికి జావకారి అమ్మమ్మలు అయిపోతారు. రక్తంలో జీర్ణించుకుపోయిన బానిసబుద్ధి ఎక్కడికి పోతుంది లెండి" వ్యంగ్యంగా అంటూ ఎత్తి పొడిచాడు కాస్త ఆవేశంగా.

"ఏమిటి జరిగింది ?" తెల్లపోయి అడిగాను.

"ఏం జరుగుతుంది.... మొగుడుగారు కౌగిలిలోకి తీసుకోగానే పెళ్ళాంగారు కరిగిపోయారు-భర్తే నాకు దైవం, కొట్టినా తిట్టినా యిక్కడే పడుంటాను. ఆయన పాదధూళే నాకు శరణ్యం. నేను రాను నీవు ఫో.... నా మొగుడిని తిట్టావంటే వూరుకోను అంటూ పతివ్రతలా నన్ను తిట్టి యింట్లోంచి పొమ్మంది-మొగుడు పెళ్ళాం యిద్దరూ బాగానే వున్నారు. మధ్య నేను ఫూల్ నయ్యాను. మొహం ఎర్రబడగా అవమానంతో, క్రోధంతో కసిగా అన్నాడు.

"ఏమిటండీ, ఏం జరిగిందో సరిగా చెప్పండి - ముందు కూర్చుని శాంత పడండి" అంటూ ఫ్రిజ్‌లోంచి నీళ్ళు తెచ్చి యిచ్చి నవ్వుతూ అన్నాను.

అప్పటికి అతని ఉద్రేకం నా మీద చూపినందుకు సిగ్గుపడి సర్దుకుని కూర్చున్నాడు. అప్పుడు జరిగిందంతా చెప్పుకొచ్చాడు.

రాత్రి స్టేషనులో గడిపి, ఉదయం పది గంటలయ్యాక ఎ. జి. అఫీసుకెళ్ళాడు ప్రసాద్. వీళ్ళని వాళ్ళని వాకబుచేసి కష్టంమీద బావగార్ని పట్టుకున్నాడు. ప్రసాద్‌ని చూసి ఎవరో తెలియనట్లే నటించాడు. మీతో మాట్లాడాలి అంటే నీతో నాకేం మాటలులేవు అని పెడసరంగా మాట్లాడడం మొదలు పెట్టాడట. ప్రసాద్ కూడా రెట్టించి మాట్లాడుతూ ఎంతకి వదలక పోవడం-ఆఫీసులో అందరూ కుతూహలంగా గమనించడం చూసి అతను సాయంత్రం యింటికిరా మాట్లాడాలంటే అంటూ ఎడ్రసిచ్చాడట. ప్రసాద్ సాయంత్రం చెల్లెల్ని, సామానూ వెంట బెట్టుకుని ఆ ఎడ్రసుకి వెళ్ళాడట-కాని అక్కడ మరెవరో వున్నారు. బావగారు తప్పు ఎడ్రసు యిచ్చాడని గ్రహించి-వీళ్ళని వాళ్ళని అడుగుతూ ఎలాగైతేనేం యిల్లు వెతుక్కుని పట్టుకున్నాడట. భార్యతో సామానుతోసహా వచ్చిన బావమరిదిని చూసి తెల్లపోతూ గుమ్మానికి అడ్డుగా నిల్చుని లోపలికి రానీయలేదట.

"నన్నడగకుండా నా పర్మిషన్ లేకుండా నీ చెల్లెలిని తీసుకురమ్మని ఎవరు చెప్పారు. వెంటనే వెళ్ళండి" అన్నాడట కోపంతో ఉడికిపోతూ. పర్మిషన్‌కోసం రెండేళ్ళు చూశాం. యింక పర్మిషన్ అవసరంలేదని నీ పెళ్లాన్ని దిగబెట్టడానికి వచ్చాను. అంటూ నిబ్బరంగా మాట్లాడుతూ సామానంతా దింపాడట-'గుమ్మానికి అడ్డులేస్తే మీ ఆవిడ లోపలికి వెడ్తుంది. యిరుగు పొరుగు చూస్తున్నారు ఆడదాన్ని అలా రోడ్డుమీద నిలబెట్టకు, అన్నాడు ప్రసాద్. యిరుగు పొరుగు ఆశ్చర్యంగా చూడడం గమనించి గత్యంతరం లేక దారి యిచ్చాడుట.

యింట్లోకి వెళ్ళాక ప్రసాద్ ఎంతనచ్చ చెప్పబోయినా వినక నోటికి వచ్చిన దుర్భాషలు ఆడి "వెంటనే యింట్లోంచి వెళ్ళకపోతే నీ చెల్లెలి మెడ పట్టి గెంటతాను. అదినాకు అక్కరలేదు. మరో పెళ్ళిచేసుకోండి-నాకీ పీడ తప్పించండి" అంటూ యిష్టం వచ్చినట్లు మాట్లాడాడట. ప్రసాద్‌కి కోపం వచ్చి 'అలాగే పెళ్ళిచేస్తాను ముందా పదివేలు పారేయ్' అని నిర్లక్ష్యంగా మాట్లాడాడు. "వెళ్ళి మా నాన్నను అడుగు ..యింక కదులు మర్యాదగా అంటూ ఆడది, తాళికట్టిన భార్య అని కాస్తయినా జాలి దయ అన్నదిలేకుండా 'నీ అన్నకి బుద్ధిలేకపోతే నీ బుద్ధి ఏమయిందని ఇలా పిలవని పేరంటానికి వచ్చావు. వద్దన్నా వెంటబడడానికి నీకు సిగ్గులేదూ' అంటూ ఏహ్యంగా చీదరించుకున్నాడట.

అసలే ఏడుస్తున్న వరలక్ష్మి ఆ మాటలకి సిగ్గుతో అవమానంతో ఏడుస్తూ వెళ్ళిపోదాం అని అన్నగార్ని ప్రాధేయపడింది. ప్రసాద్‌కి తిక్క రేగింది, పెద్ద కేకలుపెట్టి అతనూ తిట్టాడు. ఇరుగు పొరుగుని పిలిచి సంగతిచెప్పి న్యాయిం చెప్పమన్నాడు. అంతా ఆశ్చర్యంగా ముక్కున వేలు వేసుకున్నారు. తోటి ఉద్యోగులు అతనికి నచ్చచెప్పబోతే అందరిమీద, నా విషయం మీకనవసరం అంటూ ఎగిరాడు. ఆతావచ్చి నలుగురిమధ్యన వుండి నా యిష్టం వచ్చినట్లంటానంటే ఎవరూ వూరుకోరు జాగ్రత్త అని చివాట్లు పెట్టారు. నీ ఉద్యోగం ఊడ బెరికిస్తా, కోర్టుకీడుస్తా అంటూ

ప్రసాద్ కేకలుపెట్టేసరికి, ఇరుగుపొరుగు తిట్టేసరికి అతను కాస్త తగ్గి మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి ప్రసాద్ రేపటిలోగా నీకు పెళ్ళాం కావాలో అక్కరలేదో తేల్చిచెపితే మేం కోర్టుకెక్కి మాకు రావలసింది రాబట్టుకుంటాం అని ఖచ్చితంగా చెప్పగానే అతను కొర కొర లాడ్తు గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకున్నాడు.

మర్నాడు కనీసం భోజనం అయినా తెప్పించలేదు. మాట్లాడలేదు ప్రసాద్ నేను చెప్పిన ప్లీడరు యింటికెళ్ళి సంగతి వివరించాడు. ఆయన భర్త ఏలుకోడం లేదని, న్యాయం విచారించాలని దావావేద్దాం అని సలహా యిచ్చి నోటీసు తయారుచేసి యింటికివచ్చి అతన్ని బెదిరించారు యిద్దరూ. ప్లీడరు, నోటీసు, కోర్టు అనగానే బెదురు అతని మొహంలో స్పష్టంగా కనిపించింది. రేపు ఉదయంలోగా జవాబు కావాలని లేకపోతే కోర్టులో కేసు నమోదు చేస్తానని చెప్పి వెళ్ళాడు ప్లీడరు-ఆ జవాబేదో విని మర్నాడు వెళ్ళి పోవడానికి నిశ్చయించాడు ప్రసాద్-చెల్లెలు ఎంత మాత్రం అక్కడ వుండనుగాక వుండనని ఏడ్చింది....

"మరి.... యిందాక మీరేమిటి అలా అన్నారు . ." మధ్యలో ఆశ్చర్యంగా అడిగాను.

"ఉండండి. నన్ను పూర్తిగా చెప్పనీయండి... ఇదిగో యీ అనర్థం నావల్లే జరిగింది. కాలక్షేపం లేదని, మంచి సినిమా అని, మనసు బాగు లేదని రెండో ఆట సినిమాకి వెళ్ళాను. వరలక్ష్మి తలనొప్పి రానంది.... నేను వచ్చే లోపల ఏం జరిగిందీ—తెల్లవారగానే వరలక్ష్మి కలకల్లాడే మొహంతోవచ్చి, "అన్నయ్యా ఆయన మారిపోయారులా, నన్ను వుండ మన్నారు ఎంతో ప్రేమగా మాట్లాడారు జరిగిన దానికి బాధపడ్తూ క్షమాపణ కోరారు. ఏదో జరిగింది. మరిచిపో యింక నీవు యిక్కడే వుండాలి అంటూ అభిమానంగా మాట్లాడారు. యింక నాకేం భయంలేదు. అమ్మవాళ్ళతో చెప్పు నా గురించి యింక దిగులు అవసరంలేదని....' మొహంలో సంతృప్తి, ఆనందం వెల్లివిరుస్తూంటే అది చెప్పిన మాటలకి తెల్లబోయాను.

"ఆశ్చర్యంగా వుందా....రాత్రి....రాత్రి ఆయన ..." అంటూ సిగ్గుగా నవ్వింది .. 'నా అదృష్టంకొద్ది ఆయన మనసు మారింది ' అంది.

నేనింక ఆశ్చర్యంగానే వింటున్నాను. ఒక్క రాత్రికి యింతమార్పు అతనిలో ఎందుకు వచ్చింది అన్పించింది.

అప్పుడే లోపల్నించి వచ్చిన బావగారి మొహంలో కన్పిస్తున్న విజయగర్వం, నన్ను ఓడించానన్న అహంకారం ఆ నవ్వులో హేళన చూడగానే అసలు సంగతి అర్థం అయింది నాకు. అతని ప్లాను బోధపడి పోయింది. కోర్టు, భరణం యిదంతా గొడవని దాన్ని మంచి చేసుకుంటే యింట్లో పనిమనిషి అవసరమున్నా తీరుతుందని పెళ్ళాం చాటున తన ప్రేమ వ్యవహారం మరింత గుట్టుగా సాగించవచ్చని, అల్లరిపడి అందరికి చెడ్డఅయి తను చేయగలిగింది ఏమీలేదని గ్రహించాడు. అందుకే దీనితో నాలుగు మాయ మాటలు చెప్పి, పశ్చాత్తాపం వలకబోసి. ప్రేమ కబుర్లుచెప్పి దగ్గ రకి తీసుకుని వుంటాడు. యీ వెర్రిమొహంది ఆ మాటలు నమ్మి అదంతా నిజమనుకుని అతని కౌగిలిలో కరిగిపోయింది తప్ప అతని ప్లాను గ్రహించ లేదు. ముందరి కాళ్ళకి బంధం వేశాడన్నది గుర్తించలేకపోయింది.

అది గుర్తించిన నేను-అతని నాటకాన్ని బయటపెడ్తూ వ్యంగ్యంగా మాట్లాడాను, దాని తెలివి తక్కువ తన్నాని వేలెత్తి చూపాను .... వెర్రి దానిలా తలాడించక ఆలోచించి చూడు అని హెచ్చరించాను.

తన నాటకం బైట పెట్టానని కసిగా చూశాడు. మా భార్యా భర్తల మధ్య నువ్వెవడివి అన్నాడు, మా చెల్లెలు భారతనారి గదా, భర్తని నేను దూషించడం సహించలేక-ఒక్క రోజు అనుబంధంతో భర్తని వెనకేసుకు వచ్చి, ఇరవై ఏళ్ళ మా అనుబంధాన్ని కాలితో తన్ని నన్నే తిట్టింది, ఇన్నాళ్ళకి నా కాపురం కుదుటపడితే మళ్ళీ పాడుచేస్తావా అంటూ, నీవు అన్నవేనా అంటూ సినిమాలలో విన్న డైలాగులు వల్లించింది. బావగారు బండారం బయటపడిందన్న ఉక్రోషంతో యింట్లోంచి నడవమన్నారు.' నాకేం భయంలేదు, నాగురించి దిగులువద్దు-అంటూ చెల్లెలు సాగనంపింది.

నా బాధ అల్లా మా చెల్లెలు అలా అందని కాదు, బావ తిట్టాడనీ కాదు. అది అంత సుళువుగా అతని వలలో పడింది. రేపటినించి దాని బ్రతుకు ఏమవుతుందనే నా చింత. యింట్లో చాకిరికి తప్ప దాన్ని మరే

వి[illegible]ంగానూ అతను చూడడు. ఏదో నాలుగు రోజులు కొత్త ఆడది దొరికిందన్న మోజులో దీన్ని అనుభవిస్తూ, ఈ రోగా ఏ కడుపో వస్తే యింక దానికి ఆ యిల్లు తప్ప శరణ్యంలేదు. ఆ మొగుడు తన్నినా జీవితాంతం భరించి అక్కడ పడుండకా తప్పదు....యింక నేనేం చేయను చెప్పండి- దాని ఖర్మానికి దాన్ని వదిలేసి వెళ్ళడం మినహా ఏం చెయ్యగలను! అక్కడికీ దాన్నేమన్నా అన్నావా నీ అంతు తేలుస్తాఅని బెదిరించి వచ్చాను. మీ ఆడవాళ్ళు మగాడి మాటను ఎంత తేలిగ్గా నమ్మేస్తారు. ఒక్క తీపి మాటకి పడిపోతారు ఒక్క ప్రేమ కబురు చెప్పగానే పరవశిస్తారు. ఒక్క కౌగిలింతకే పరవశించి సర్వం అర్పిస్తారు. ఎన్ని చూస్తున్నా, ఎంత చదివినా యింత తేలిగ్గా మగాడ్ని నమ్మి అతని చేతిలో కీలుబొమ్మ అయి ఆడించి నట్లాడు తుంటారు. యింక మిమ్మల్నెవరు రక్షించగలరు! మిమ్మల్ని మీరే నాశనం చేసుకుంటూ ఎవరో అన్యాయం చేస్తున్నారని వాపోతుంటారు. ఏం నా మాట అబద్ధం అనగలరా, కాదంటారా...." ఆవేశంగా సవాల్ చేశాడు ప్రసాద్.

ఏం చెప్పను? కాదని ఎలా అనగలను? ఆడదంటే ఆడేది మాత్రమే కాదు ఆడించేదికూడా అని ఏ ధైర్యంతో చెప్పగలను! తలవంచుకున్నాను.

(తరుణ నుండి సంగ్రహింపబడినది.)